నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నగరంలో అభివృద్ధి పనులు ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

నయీంనగర్, డిసెంబర్ 3: వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మంగళవారం నగరంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 56వ డివిజన్ సురేంద్రపురి కాలనీ నుంచి కొండా మురళి గెస్ట్‌హౌస్ వరకు రూ.72లక్షలతో చేపట్టే సీసీరోడ్డు, డ్రైనేజీ, ద్వారకసాయి కాలనీలో రూ.30లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని అన్నారు. మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ సునీల్, 56వ డివిజన్ అధ్యక్షుడు కే హరిబాబు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలో కార్పొరేటర్ ఫొటో కట్??

అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరైన ఎమ్మెల్యేకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్ ఫొటో లేదు. దీంతో ఇప్పటి నుంచే వర్గాలు మొదలయ్యాయా అంటూ పలువురు చర్చించుకున్నారు. మరోవైపు ఎమ్మెల్యే తన డివిజన్‌కు రాగా స్థానిక కార్పొరేటర్ స్వాగతం పలకలేదు. ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఆ కార్పొరేటర్ ఎమ్మెల్యేతో దూరం పాటిస్తున్నాడా? ఎమ్మెల్యేనే దూరం పెడుతున్నాడా? అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

విలీన గ్రామాల్లో 'రేవూరి' పర్యటన

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పరకాల, డిసెంబర్ 32: పట్టణంలోని 7, 8వార్డుల పరిధి విలీన గ్రామాలైన రాజీపేట, సీతారాంపురం గ్రామాల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మంగళవారం అధికారులు, స్థానిక కౌన్సిలర్లతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకుని మాట్లాడారు. విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. పాత మున్సిపల్ భవనంలో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో పరకాల బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.1.08 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులను సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

ఆత్మకూరు, డిసెంబర్ 3: మండల కేంద్రంలోని స్వెక్టా హైస్కూల్‌లో మంగళవారం టీటీడీ హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. టీటీడీ ఉపన్యాసకులు నాగబండి శివప్రసాద్, పోలు రాజేశ్‌కుమార్ పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. భగవద్గీత జీవన విధానాన్ని నేర్పిస్తుందన్నారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు.

BEFORE THE HON'BLE TELANGANA STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT HYDERABAD
F.A.No. 287 of 2024
Between:
M/s. J.K.Constructions, Rep.by its Managing Partner
.. Appellant/Opposite party No.2
AND
Janga Komuraiah and Another
..Respondents/Complainant/OP-1
To,
Janga Komuraiah, S/o. Sri Vodaiah, Age: 68 years, Occu: Rtd.Employee, R/o.Flat No.202, Vidhathri Towers, Ram Nagar, Hanamkonda 506001, Warangal City & Dist.
NOTICE
Take notice that the above named Appellant M/s. J.K.Constructions, Rep.by its Managing Partner Kasagani Jagadeeshwar, S/o. Late. K.Sarangapani, Age: 38 years, Occu:Business, R/o.H.No.2-4-1224/2, Vidyanagar, Hanamkonda, Warangal District, filed the above appeal against the orders of the District Consumer Disputes Redressal Commission-Warangal in C.C.No.121 of 2018 dated: 27-03-2024, vide F.A.No.287 of 2024 before the Hon'ble Telangana State Consumer Disputes Redressal Commission, Hyderabad. The above appeal is coming for your appearance on 11-12-2024 and you are arrayed as Respondent No.1 in the above appeal.
Therefore, you are hereby called upon to appear in person or through an advocate before the Hon'ble Telangana State Consumer Disputes Redressal Commission, Hyderabad on 11-12-2024 at 10.30 am., in the above matter, otherwise the matter will be decided in accordance with law by setting you exparte.
Sd- **P. LAKSHMAN GOUD,**
Advocate, Ph: 98488 44177

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
★I, **MOHAMMED HANEEFUDDIN S/o MOHAMMED MUNEERUDDIN** (New Name) H.No: 16-11-451/44, Chinthal, Warangal, Warangal Dist. TG, Changed my name from **MOHAMMAD HANEEFUDDIN S/o MUNEERUDDIN** to **MOHAMMED HANEEFUDDIN S/o MOHAMMED MUNEERUDDIN** for all purpose.
NTW-000

CHANGE OF NAME
I, **BOKKA LAXMI** W/o **BOKKA KRISHNA @ CHILUMULA RAJESWARI D/o CHILUMULA NARSAIAH** R/o H.No. 10-113/8, Vill: Palakurthy, Mdl: Palakurthy, Jangaon Dist TG, There fore above said both names **BOKKA LAXMI** and **CHILUMULA RAJESWARI** bearing to me only and I am One and same person.

CHANGE OF NAME
★I, **NALLATHEEGALA MANASWINI W/o NALLATHEEGALA RAGHUNATH** H.No: 7-1-364/15, Padmakshi Colony, Hanamkonda, Hanumakonda Dist. Pin-506001. TG, Here by declare that. Changed my name from **CHAPARTHY KAVITHA D/o CHAPARTHY KANKAIAH** to **NALLATHEEGALA MANASWINI W/o NALLATHEEGALA RAGHUNATH** for all purpose.
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

భీమదేవరపల్లి: ముల్కనూరులో శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హనుమకొండ: హరిత హోటల్‌లో సమావేశమైన తెలంగాణ ఉద్యమకారులు

హనుమకొండ చౌరస్తా: కేయూ ఫస్ట్ గేట్ వద్ద శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

తెలంగాణ అమరవీరులను మరువం

- అమరుల త్యాగాలతోనే ప్రత్యేక రాష్ట్రం
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ: శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, డిసెంబర్ 3: తెలంగాణ అమరవీరులను తెలంగాణ సమాజం, బీఆర్ఎస్ మరవదని పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరుడైన కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతి మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. వినయ్‌భాస్కర్ పార్టీ శ్రేణులతో కలిసి శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జోహార్ శ్రీకాంతాచారి అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, అమరుల కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ అమరవీరుల ఆకాంక్షల మేరకే తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన సాగించారన్నారు. పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, నాయకులు జానకిరాములు, పోలపల్లి రామ్మూర్తి, విద్యార్థి నాయకులు బీ ప్రశాంత్, జీ రాకేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ కేయూ శాఖ ఆధ్వర్యంలో..

హనుమకొండ చౌరస్తా: శ్రీకాంతాచారి అమరత్వం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపిందని బీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఫస్ట్ గేట్ వద్ద శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాంతాచారి పోరాటాన్ని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు పాలమాకుల కొమురయ్య, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ఆరూరి రంజిత్, రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్, కందికొండ తిరుపతి, కొనుకటి ప్రశాంత్, పిన్నింటి విజయ్‌కుమార్, రోహిత్, సిద్ధు, రాజేశ్ పాల్గొన్నారు.

ముల్కనూరులో..

భీమదేవరపల్లి: మండలంలోని ముల్కనూరులో మంగళవారం తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి 15వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు డేగల సారయ్య, ఎదులాపురం తిరుపతి, కండె చక్రపాణి, రేణికుంట్ల భిక్షపతి, అదరి శ్రీనివాస్, బొల్లంపల్లి రమేశ్, మాట్ల వెంకటస్వామి, అలుగు సంపత్ పాల్గొన్నారు.

ఉద్యమకారులు ఐక్యత చాటాలి

హనుమకొండ: మలిదశ తెలంగాణ ఉద్యమకారులు ఐక్యత చాటాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సందెల సునీల్‌కుమార్ అన్నారు. నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఉద్యమకారుల సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. తొలుత అమరుడు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలి దశ తెలంగాణ ఉద్యమంలో 369మంది, మలిదశ ఉద్యమంలో సుమారు 1300 మంది అమరులయ్యారని తెలిపారు. 2017లోనే ఉద్యమకారుల సంఘాన్ని స్థాపించి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉద్యమకారుల సంఘం నాయకులు గుర్రం రఘు, అల్లా బాబు, కే యాకన్న, ఇమ్మడి రవీందర్, గజ్జి సంతోష్, ముద్దసాని వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి నరసింహారెడ్డి, సమ్మన్న, కక్కెర్ల వెంకన్న, ఎడవెల్లి దండయ్య, ఓదెల సమ్మయ్య యాదవ్, కే రమేశ్, శంకర్‌రావు, కోదండరాం, తుప్పరి పరశురాములు, దూడ మొగిలి పాల్గొన్నారు.

సంకల్పం ముందు వైకల్యం అవరోధం కాదు

కలెక్టర్ పి.ప్రావీణ్య

బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

నయీంనగర్, డిసెంబర్ 3: మనో సంకల్పం ముందు వైకల్యం అవరోధం కాదని కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం బీఆర్ అంబేద్కర్ భవన్‌లో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైకల్యంతో బాధ పడకుండా భవిష్యత్‌పై దృష్టిసారించాలని, జీవితంలో ఎదిగినా ఆదర్శంగా నిలవాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారు, ఉపాధి రంగాల్లో రాణించాలన్నారు. ఇటీవల జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులను అందజేశారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు సర్దార్ దర్శన్ సింగ్, ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, డీఆర్డీఓ ఎం శ్రీనివాస్, ఏపీడీ శ్రీనివాసరావు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు అనితారెడ్డి, ప్రముఖ కవి, విద్యా ఫౌండేషన్ చైర్మన్ బిల్లా మహేందర్, డాక్టర్ వెంకట్రాంరెడ్డి, సీడీపీవోలు విశ్వజ, స్వరూప, స్వాతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యాలయ సూపరింటెండెంట్ జీ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎఫ్ఆర్వో రవికృష్ణ, ఇన్‌చార్జి డీసీపీవో ప్రవీణ్‌కుమార్, కళ్యాణి, సుమలత, అరుణ, స్వర్ణలత పాల్గొన్నారు.

లంచం అడిగితే 1064కు కాల్ చేయండి

సుబేదారి: ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఏ ఉద్యోగి అయినా లంచం అడిగితే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారద సూచించారు. అవినీతి నిరోధకశాఖ వారోత్సవాల సందర్భంగా మంగళవారం హనుమకొండ సుబేదారిలోని హనుమకొండ కలెక్టరేట్, అదాలత్ కాళోజీ జంక్షన్‌లోని వరంగల్ కలెక్టరేట్‌లో 'కలెక్టర్లు అవినీతిని తరిమేద్దాం.. దేశాభ్యుదయానికి పునాదులు వేద్దాం –లంచం అడిగితే ఇవ్వకండి' కరపత్రాన్ని ఆవిష్కరించారు. కలెక్టర్లు మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్ రాజు, రెండు జిల్లాల కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ఎదుట ఆర్టిజన్ కృష్ణ కుటుంబ సభ్యుల ధర్నా

ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు

హనుమకొండ, డిసెంబర్ 3: నర్సంపేట డివిజన్ లక్నెపల్లి సబ్‌స్టేషన్ గ్రేడ్–1 ఆర్టిజన్ కార్మికుడు గుగులోత్ కృష్ణ నవంబర్ 21న పెయింటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్సపొందుతూ ఈనెల 2వ తేదీన మృతి చెందాడు. కాంట్రాక్టర్‌తో పెయింటింగ్ పనిచేయించాల్సి ఉండగా, ట్రాన్స్‌కో ఉద్యోగితో చేయించారని, ఈ ప్రమాదానికి ఉన్నతాధికారుల తప్పిదమే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మంగళవారం ములుగు రోడ్డులోని 220 కేవీ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కృష్ణ మృతికి కారణమైన ఏఈ, డీఈపై అట్రాసిటీ కేసు నమోదు చేయడంతోపాటు సస్పెండ్ చేయాలని, మృతుడికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజాసంఘాలు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో చీఫ్ ఇంజినీర్‌తో పలుమార్లు చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో టెంట్ వేసి ఆందోళన కొనసాగిస్తూ వంటా వార్పు చేశారు. ఆర్టిజన్ ఉద్యోగ సంఘాల బాధ్యులు ఈశ్వరరావు, ఎంఏ వజీర్, సదానందం, సాయిలు, గిరిజన సంఘం జిల్లా సెక్రటరీ వీరన్న, సంగెం మాజీ జడ్పీటీసీ వీరమ్మ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బదావత్ రాజు, సేవాలాల్ బంజారా సంక్షేమ సంఘం బాధ్యులు తేజావత్ జోహార్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు వెంకట్‌నాయక్, గుగులోత్ రాజు పాల్గొన్నారు.

ఇద్దరికి రెండు రోజుల సమాజ సేవ శిక్ష

కాజీపేట, డిసెంబర్ 3 : కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి న్యాయమూర్తి రెండు రోజుల సమాజ సేవ శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చినట్లు కాజీపేట ట్రాఫిక్ సీఐ నాగబాబు తెలిపారు. పోలీస్ సిబ్బంది కాజీపేట పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ బండి ఏడుకొండలు, దండుగుల వెంకటేశ్ పట్టుబడినట్లు పేర్కొన్నారు. వారిని కోర్టు కానిస్టేబుల్ కుమార్ రెండోశ్రేణి కోర్టు న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి ఎదుట హాజరుపరిచినట్లు చెప్పారు. వారిద్దరినీ రెండు రోజులు సమాజ సేవ చేయాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు వివరించారు. ఈమేరకు కాజీపేట సర్కిల్ మున్సిపల్ కమిషనర్ ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు.

మహిళలు ఉన్నతంగా ఎదగాలి

మగ్గం శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న సహాయ

ఆత్మకూరు, డిసెంబర్ 3: మహిళలు ఉన్నత స్థానానికి ఎదగాలని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ డైరెక్టర్ సిస్టర్ సహాయ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహిళలకు ఉచిత మగ్గం వర్క్స్ శిక్షణ సెంటర్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా సిస్టర్ సహాయ మాట్లాడుతూ మహిళా సాధికారత ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే మహిళలు పురుషులతో సమానంగా ఎదుగుతారని తెలిపారు. మగ్గం వర్క్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రోగాం కోఆర్డినేటర్ శ్రీకాంత్, మేనేజర్ అజయ్‌కుమార్, మా సోషల్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి శివప్రసాద్, శిక్షకురాలు మమత, మాధవి పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ గ్రేటర్ వరంగల్ సంయుక్త కార్యదర్శిగా మహేందర్

నియామకపత్రం అందుకుంటున్న మహేందర్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 3: తెలంగాణ ముదిరాజ్ మహాసభ గ్రేటర్ వరంగల్ సంయుక్త కార్యదర్శిగా హనుమకొండ 4వ డివిజన్ రెడ్డికాలనీకి చెందిన పుట్టా మహేందర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు అర్బన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బయ్యా స్వామి, పులి రజినీకాంత్ మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ విజయ్‌కుమార్ గౌడ్‌కు సన్మానం

విజయ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట, డిసెంబర్ 3 : హైదరాబాద్ నాగోల్‌లోని సుప్రజ దవాఖాన మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శిగ విజయ్‌కుమార్ గౌడ్ హనుమకొండ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా కాజీపేటలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌని సాంబయ్య గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటి చెట్ల పైనుంచి పడిన గీత కార్మికులకు తమ దవాఖానలో ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కల్లుగీత కార్మిక సంఘం సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సురుగు రాజేశ్‌గౌడ్, కాజీపేట మండల అధ్యక్షుడు మోడెం రాజేందర్ గౌడ్, జిల్లా గౌరవ సలహాదారు బుర్ర రాజన్‌బాబు గౌడ్, కార్తీక్‌గౌడ్, చిర్ర నర్సింగ్‌గౌడ్, శ్యామ్‌సుందర్, దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

శాయంపేట పీహెచ్‌సీ 4గంటలకే ఖాళీ

- డ్యూటీ సమయాన్ని చెప్పిన డాక్టర్
- 24గంటల దవాఖానలో దుస్థితి

మంగళవారం సాయంత్రం పీహెచ్‌సీకి జ్వరం మందుల కోసం వచ్చి ఎవరూ లేక వెనుదిరిగిన మొగిలి

శాయంపేట, డిసెంబర్ 3: మండల కేంద్రంలో 24గంటలు వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ దవాఖాన సాయంత్రం 4 గంటలకే ఖాళీ అవుతోంది. గతంలో రాత్రి వేళల్లోనూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించగా, కొన్ని నెలలుగా సాయంత్రం 4 గంటలు కాగానే అందరూ వెళ్లిపోతున్నారు. మంగళవారం సాయంత్రం 4.20గంటలకు కొందరు రోగులు శాయంపేట పీహెచ్‌సీకి వచ్చారు. డాక్టర్‌తోసహా ఒక్కరూ లేరు. వాచ్‌మెన్ గొల్లాలు పెట్టి క్లోజ్ చేసే పనిలో ఉన్నాడు. రోగులు అడిగితే 4గంటల వరకే తెరిచి ఉంటదని చెప్పాడు. దీంతో తనకు దగ్గుమందు కావాలని అడిగి అక్కడున్న మందు సీసాను ఒకరు తీసుకెళ్లారు. ఇంతలో వాచ్‌మెన్ వైద్యాధికారి సాయికృష్ణకు ఫోన్ చేసి వారికి ఇచ్చారు. తమ డ్యూటీ సాయంత్రం 4గంటల వరకేనని, ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకే పనిచేస్తామని, ఆ తర్వాత ఉండమని చెప్పడంతో అవాక్కయ్యారు. ఇటీవల డీహెచ్‌వో అప్పయ్య సందర్శించి 24గంటల వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. కానీ బేఖాతరు చేస్తూ డాక్టర్, వైద్య సిబ్బంది అందరూ సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లకు వెళ్లిపోయారు.

జ్వరం గోళీల కోసం వచ్చిన.. ఎవరూ లేరు

నాకు నాలుగు రోజులుగా జ్వరం, నొప్పులున్నాయి. శాయంపేట సర్కారు దవాఖానకు 4.20 గంటలకు వచ్చిన. 4 అయినంక ఎవరూ ఉండరట. నాకు తెల్వదు. అంతదూరం నుంచి వత్తే ఒక్కరూ లేరు. 24గంటల వైద్యసేవలు అందిస్తే ప్రజలకు మేలు జరుగుతది.

– అంకేశ్వరపు మొగిలి, పత్తిపాక

సాధారణ ప్రసవాలు పెంచాలి : డీఎంహెచ్‌వో



వంగర ప్రభుత్వ దవాఖానను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

భీమదేవరపల్లి, డిసెంబర్ 3: దవాఖానలో సాధారణ ప్రసవాలు పెంచాలని జిల్లా వైద్యాధికారి అల్లం అప్పయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని వంగర ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వాస్పత్రి భవనం, గదులను పరిశీలించారు. ఆస్పత్రిలో గదులు మరమ్మతు చేయాల్సి ఉందని, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు. ఆస్పత్రి చుట్టూ గడ్డి, పిచ్చి మొక్కలు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఐపీ (ఇన్ పేషెంట్స్) రిజిస్టర్ ఎందుకు రాయడం లేదని వైద్యాధికారులు రెహమాన్, రుబీనాను ప్రశ్నించారు. ఎక్స్‌రే గదిలో ఎక్స్‌రే టెక్నీషియన్ లేకపోవడం, ఎక్స్‌రే యంత్రం పనిచేయకపోవడాన్ని పరిశీలించారు. ఎక్స్‌రే యంత్రం రిపేరు చేయించడంతోపాటు టెక్నీషియన్‌ను పంపిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఇద్దరు వైద్యాధికారులు ఉండగా, మరో వైద్యాధికారిని పంపిస్తామని చెప్పారు. రోగుల కోసం ఆస్పత్రికి తాత్కాలికంగా 108 వాహనం ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. వైద్యాధికారులతోపాటు సిబ్బంది రవీందర్‌రెడ్డి, వాణి, మోహన్, సుధీర్ పాల్గొన్నారు.

కాజీపేటలో సుందరీకరణ విగ్రహాల ఆవిష్కరణ

కాజీపేట చౌరస్తాలో సుందరీకరణ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, డిసెంబర్ 3: కాజీపేట చౌరస్తాలో సుందరీకరణ విగ్రహాలను మంగళవారం నగర కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణితో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.28లక్షల స్మార్ట్ సిటీ నిధులతో కాజీపేట చౌరస్తాలో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. పలురకాల ప్రయాణికుల విగ్రహాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ పాల్గొన్నారు.

బాలసముద్రంలో ఈఫిల్ టవర్ జంక్షన్ ప్రారంభం

హనుమకొండ: హనుమకొండ బాలసముద్రంలోని ఈఫిల్ టవర్ జంక్షన్ అభివృద్ధి పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మేయర్ గుండు సుధారాణితో కలిసి ప్రారంభించారు. రూ.23.50లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. స్థానిక కార్పొరేటర్ రావుల కోమల, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవాలి

ప్రత్యేక అవసరాల పిల్లలతో ప్రధాన న్యాయమూర్తి, కేంద్రం నిర్వాహకులు

హనుమకొండ, డిసెంబర్ 3: ప్రత్యేక అవసరాల పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ రమేశ్ అన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో దివ్యాంగుల వారోత్సవాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు తన వంతుగా కంప్యూటర్లతోపాటు శిక్షణ ఉచితంగా అందిస్తామన్నారు. తమ వంతు న్యాయ సహకారం అందిస్తామని డీఎల్ఎస్ఏ సెక్రటరీ క్షమా దేశ్‌పాండే అన్నారు. పిల్లల సాంస్కృతిక ప్రదర్శన చూపరులను అలరించాయి. మల్లికాంబ కేంద్ర నిర్వాహకులు బండా రామలీల, ప్రొఫెసర్ పద్మ, కోడం కల్యాణ్, యాదగిరి పాల్గొన్నారు.

ఈ నెలాఖరులోగా పదోతరగతి సిలబస్ పూర్తి

వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

ఎల్కతుర్తి, డిసెంబర్ 3: పదో తరగతి సిలబస్ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని వల్భాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, మధ్యాహ్న భోజన రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పదోతరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరం పదోతరగతి పరీక్ష ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వంట చేయాలని, వంట పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు చెప్పారు. అనంతరం విద్యార్థుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం బద్దం సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవ పరిణామ సత్యాన్ని చాటుదాం..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మసాగర్, డిసెంబర్ 3: జీవ పరిణామ సత్యాన్ని చాటుదామని జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కవితాదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జీవ పరిణామ సిద్ధాంత ప్రచార ఉద్యమంలో వైద్య విజ్ఞాన సదస్సు ఇన్‌చార్జి, హెచ్ఎం ధర్మప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించారు. జీవ పరిణామ సత్యాన్ని చాటుదాం, చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతం పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. టీచర్లు పద్మజ, రాజమ్మ, కిరణ్మయి, రామకృష్ణ, ప్రసన్న పాల్గొన్నారు.

మంత్రి పదవి కోసమే మాలల ఉద్యమం

ఎంహెచ్‌పీఎస్ అధ్యక్షుడు ఉపేందర్ మాదిగ

సమావేశంలో మాట్లాడుతున్న మైస ఉపేందర్ మాదిగ

ధర్మసాగర్, డిసెంబర్ 3: మంత్రి పదవి కోసమే మాలలు ఉద్యమం చేస్తున్నారని ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఎస్సీ రిజర్వేషన్ రాష్ట్రాలు చేయాలని ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఉద్యమం ఎందుకు చేస్తున్నారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఆయన మంత్రి పదవి కోసమే ఉద్యమం చేస్తున్నారని మాలలపై ప్రేమతో కాదన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పును వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, లేని పక్షంలో మాదిగల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆ సంఘం హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వంతడుపుల అన్వేష్, నాయకులు అనిల్, ఎర్ర మధు, సంపత్ పాల్గొన్నారు.